విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వపడాలి

రాజకీయాల్లోకి వచ్చే వారికి జగన్ ఒక నిఘంటువు

పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - బ్యూరో అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో పని చేస్తున్నందుకు తామంతా గర్వపడాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైయస్సార్సీపి 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో భాగంగా పార్టీ పతాకాన్ని మంత్రి అమర్నాథ్ ఆవిష్క రించారు. ఆ తర్వాత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నేతల సమక్షంలో మంత్రి అమర్నాథ్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డిని అనేక అవమానాలకు గురి చేసిందని అన్నారు. అయినప్పటికీ తన తండ్రి ఆశయ సాధన కోసం వాటన్నింటినీ తట్టుకొని పార్టీని స్థాపించి, ఈరోజు సుస్థిర ప్రభుత్వాన్ని నడుపుతున్న ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మీద తప్పుడు కేసులు బనాయించి, జైలులో పెట్టి పార్టీని మొగ్గలోనే తురిమేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, చంద్రబాబు నాయుడు కుట్రలు పన్నినా తట్టుకుంటూ వచ్చి ఒంటి చేత్తో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జగన్మోహన్ రెడ్డి వంటి బలమైన నాయకుని వద్ద కార్యకర్తలుగా పనిచేయడానికి తాము ఆనంద పడుతున్నామని అమర్నాథ్ చెప్పారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అనేక మంది ప్రముఖులను కలిశానని, ఆయా సందర్భాలలో వారు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురించి మాట్లాడు తున్నప్పుడు తన రోమాలు నిక్కబొడుచు కుంటుటాయని అమర్నాథ్ చెప్పారు. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కు దేశంలోని పారిశ్రామిక ప్రముఖులంతా ఒకే వేదిక మీదకు వచ్చి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మీద ఉన్న నమ్మకాన్ని రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక విధానాన్ని వేనోళ్ళ పొగిడారని చెప్పారు. దీన్నిబట్టి జగన్మోహన్ రెడ్డి సమర్థత అర్థమవుతుందని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి దొడ్డి దారిన ముఖ్యమంత్రి కాలేదని, జన హృదయాలను మెప్పించి ముఖ్యమంత్రి అయ్యారని ఆయన అన్నారు. పొలిటికల్ ఫైటర్ ఎలా ఉండాలో జగన్మోహన్ రెడ్డిని చూసి నేర్చుకోవాలని అమర్నాథ్ చెప్పారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారికి జగన్మోహన్ రెడ్డి నిఘంటువు అని అమర్నాథ్ అన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్య మంత్రులకు జగన్ మోహన్ రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఆయన చెప్పారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చేసుకోవాలని అమర్నాథ్ పిలుపునిచ్చారు. అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరింత సమర్థవంతంగా కొనసాగి స్తున్నారని అన్నారు. ఆర్థిక భరోసా, సొంత ఇల్లు ఇచ్చి పేదవారి గుండెల్లో జగన్మోహన్ రెడ్డి గూడుకట్టు కున్నారని అన్నారు. సుస్థిర పాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆమె అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించడానికి ముందు అనేక అవమానాలకు గురి అయ్యారని, అక్రమ కేసుల్లో 16 నెలల పాటు జైల్లో పెట్టిన వెరవకుండా మొక్కవోని ధైర్యంతో నిలబడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గం నుంచి అమర్నాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా పేదవాళ్లకు మంత్రి అమర్నాథ్ దుప్పట్లు పంపిణీ చేశారు.

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

విశాలాంధ్ర - కె. కోటపాడు : అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కొనసాగుతున్న సేవల పట్ల ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హర్షం వ్యక్తం చేసి ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. ఏ.కోడూరు లోని %ఙా% హై స్కూల్లో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం రక్త దాతలకు ప్రశంస పత్రాలు, మేమొంటోలను ప్రధానం చేశారు. ఈ రక్తధాన శిబిరానికి స్థానికంగా ఉన్న యువకులు స్వచ్ఛందంగా వచ్చి 58 మంది రక్తదానం చేశారు. మన ప్రాంతంలో శస్త్ర చికిత్సలు, ప్రమాదాలు జరిగినప్పుడు మరియు మహిళలు కాన్పు సమయంలో వారి ప్రాణాలు కాపాడటం కోసం రక్తం అవసరమైనపుడు ఇటువంటి శిబిరాలు చాలా ఉపయోగపడుతున్నాయి అని ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకట రావు అన్నారు. ఈ మెగా రక్తధాన శిబిరం జయప్రదం చేసిన రక్తదాతలు కు, స్థానిక పెద్దలకు పేరు పేరు న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, పైలా ప్రసాదరావు, స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనురాధ, అమ్మ బ్లడ్ బ్యాంక్ వినోద్ బాలు, ఉపాధ్యాయులు సూరెడ్డి బాబురావు, లెక్కల ఎరుకు నాయుడు ఎన్‌సి సి టీమ్, లెక్కల కోటేశ్వర రావు , సెక్రెటరీ సింగంపల్లి అచ్చిబాబు, లెక్కల సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ సింగంపల్లి అర్జున మరియు ట్రస్ట్ సభ్యులు నాయుడు, సింగంపల్లి రామారావు, లెక్కల శ్రీధర్, లెక్కల మధు తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్ర హత్య కేసుపై జుడీషియల్ విచారణ జరపాలి

సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని పీఎల్‌పురం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్ర కేసును జుడీషియల్ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ నాగేంద్ర హత్య కేసును పక్కదారి పట్టించిన నేపధ్యంలో ఈనెల 27న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. 31వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవదిక నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేసులో 302, 201తో పాటు ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా, 2ఎకరాల వ్యవసాయ భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు ఇలపు నాగబాబు, కన్వీనర్ తాటిపర్తి అప్పారావు, కార్యనిర్వహక అధ్యక్షులు మార్తి సింహాచలం, జి.లాజరుబాబు, ఉపాధ్యక్షులు గారా జయబాబు, కార్యదర్శులు బంగారు లోవరాజు, గంటేటి చిట్టిబాబు, సహాయ కార్యదర్శి ఇలపు లోవరాజు, కోశాధికారి బంగారి చిన లోవరాజు, సభ్యులు బి.రమేష్, పెదపాటి నూకరాజు, బోడపాటి సురేష్, ఎం.నరసింహులు, మాలమహానాడు, రెల్లి సంక్షేమ సంఘం, ఎంఆర్‌పిఎస్ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - యస్.రాయవరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ధర్మవరం అగ్రహారం గ్రామంలో మండల పరిషత్ మోడల్ స్కూల్ లో పోలింగ్ బూత్ కు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. బందోబస్తు సంబంధించి ఏర్పాట్లు ను నర్సీపట్నం డిఎస్పీ కె. ప్రవీణ్ కుమార్ పరిశీలించి సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్, నక్కపల్లి సిఐ వి. నారాయణరావు, ఎస్సై ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

విశాలాంధ్ర - నాతవరం : మార్చి 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో నాతవరం ఎస్సై డి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు భంగం కలగకుండా గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల సందర్భంగా 30 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - ఏఎస్ఆర్ జిల్లా : సోమవారం జరగనున్న పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు అల్లూరి జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించటానికి అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా సూపరింటిండెంట్ ఆఫ్ పోలిస్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. ఎన్నికల నిర్వహణకు ఐదు వందల మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అందులో భాగంగా ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు డి.ఎస్పీలు, ఆరుగురు సర్కిల్ ఇన్స్పెక్టర్లుతో పాటు 13 మంది సబ్ ఇన్స్పెక్టర్లు, 48 మంది ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, 85 మంది పోలీస్ కానిస్టేబుల్స్, 15 మంది మహిళా పోలిస్ కానిస్టేబుల్స్, ఎ ఆర్ నుండి 75 మంది, ఎపిఎస్పీ నుండి 56 మంది సిబ్బందిని నియమించటం జరిగందని, వీరు కాకుండా మరో 200 మంది స్పెషల్ పార్టీ సిబ్బందిని కేటాయించడం జరిగిందని ఎస్పీ వివరించారు.

ఒకే చెల్లింపుతో వాంబే గృహరుణ విముక్తి

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 40 వ వార్డు ఏకేసి కాలనీలో బాంబే ఇల్లులు 18 ఏళ్ళకు తీరిన గృహ రుణభారం తీర్చే అవకాశం రావడంతో 316 గృహరుణ బాధితుల ఆనందం వ్యక్తం చేశారు ఆదివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు గతంలో 2006లో ఇల్లు నిర్మాణానికి రుణాన్ని మంజూరు చేసి నెల నెల వాయిదాల పద్ధతిలో రుణం కట్టించే అవకాశం కల్పించారు అయితే నేటితో రుణభారంతో బ్యాంక్ అధి కారులు చెల్లింపు ధృవీకరణ పత్రాలు మరియు రెవెన్యూ పంపిణీ చేశారు వన్ టైమ్ సెటిల్మెంట్ సర్టిఫికెట్ పద్ధతిలో ఆటోనగర్ బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాజువాక బ్రాంచ్ మేనేజర్ అప్పారావు ,చీఫ్ మేనేజర్ ఏఎస్ఆర్ వంతులు, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీనివాసరావు, వెన్నెల గారు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ 2006లో తమ కాలనీలో 316 గృహాలకు యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు ప్రభుత్వ సబ్సిడీ తో నిర్మాణాలు చేపట్టారని,ఆ సందర్భంలో లబ్ది దారు లందరికీ రూ.25 వేలు గృహరుణలు ఇచ్చారని, గడిచిన 18: ఏళ్లలో వడ్డీతో రూ.లక్ష రూపాయలు ప్రతి గృహనివాశి చెల్లించాల్సి ఉందని, ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఒకేసారి 2500 రూపాయలు చెల్లించటంతో లబ్ధి దారులకు రుణం విముక్తి చేసినట్లు ప్రక టించారు. ఇలాంటి ప్రజా ప్రయో జనాలు, ప్రజా సంస్కరణలను ప్రజలు గుర్తించి మళ్ళీ అధికారాన్ని జగనన్న ప్రభుత్వానికి పట్టం గడుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు వరపల మహేష్ కన్వీనర్లు దండి శ్యామ్, శరగడం గంగరాజు, గృహ సారథులు అన్నెపు సూర్య నారా యణ, గురుగుబిల్లి బైరాగి, పెంట్ల బాల కృష్ణ, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి దశ దిశ నిర్దేశించేది వైసీపీ : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - పాడేరు : 13 ఏళ్ల క్రితం మహానేత అనుకోని పరిస్థితుల్లో మనకు దూరమైన నేపథ్యంలో పురుడు పోసుకున్న పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని నేడు ఆ పార్టీ ఒక్కటే రాష్ట్రానికి దశా దిశా నిర్దేశించే స్థితిలో ఉందని శాసనసభ్యుల కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమ వారం పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు హాజరైన ఈ కార్యక్రమంలో ముందుగా పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కేక్ కట్ చేసి అభిమా నులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒకటే ఆంధ్రప్రదేశ్‌కు మంచి భవిష్యత్తును ఇవ్వగలరని ప్రజలు నమ్మరు కాబట్టే 2019 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి మన నుంచి దూరమైన అనంతరం అనుకోని పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్టా నానికి ఎదురెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంతో నూతన శఖాన్ని ప్రారంభించి సుమారుగా 10 ఏళ్ల పాటు ప్రజాక్షేత్రంలో పోరాటం చేసి ప్రజా సమస్యలు తెలుసుకొని నేడు ప్రభుత్వాన్ని స్థాపించి సంక్షేమ పాలన అందిస్తు న్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే వైయస్ జగన్మో హన్ రెడ్డి నూతన అధ్యయనానికి తెర తీశారని చెప్పారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఇటువంటి మ్యాండేట్ ను ఎప్పుడు ప్రజలు ఇవ్వలేదని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పైనా జగన్మోహన్ రెడ్డి పైనా ప్రజలపై అంతటి విశ్వాసం ఉంచారు కాబట్టే ఇంతటి గొప్ప విజయాన్ని ఇచ్చి ఈ సంక్షేమ పాలనకు ఆద్యం పోసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైస్ ఎంపీపీ కుంతార కనకాలమ్మ, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వ్యవసాయ సలహా మండలాధ్యక్షులు మినుముల సరస్వతి, ఎస్టీ సెల్ జోనల్ అధ్యక్షులు కిముడు విశ్వ, మండల కన్వీనర్ పలాస కోటేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కన్వీనర్లు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

759 రోజుకు విశాఖ ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి ఆద్వర్యాన 759వ రోజు రిలే నిరాహార దీక్షలులో స్టీల్ ప్లాంట్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష" లో పాల్గొన్నారు. ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బోండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య నేతృత్వం లో స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ రంగ సంస్థ గా కొనసాగే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళలర్పించారు. ఈ కార్యక్రమంలో యు. సత్యారాయణ , పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సి ఐ టీయు గౌరవ అధ్యక్షుడు ఆయోధ్య రామ్, వరసాల శ్రీనివాసరావు, హిందుస్తాన్ షిప్ యార్డ్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్ కుమార్, కొండలరావు, ఎస్ సత్యనారాయణ, ఎల్‌వి.రమణరావు, మోహన్ బాబు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు



విశాలాంధ్ర - యలమంచిలి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని పట్టణ ఎస్సై కె.పావినాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబోయే పోలింగ్ బూత్‌ని సందర్శించిన ఆయన ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రశాంతం వాతావరణంలో నిర్భయంగా ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎండల దృష్ట్యా త్వరతిగతిన ఓట్లు ముగించేలా అందరూ సహకరించాలన్నారు. ఎన్నికల్లో వికలాంగులకు తమవంతుగా పోలీసు సిబ్బంది సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంల తరలింపు పూర్తి చేసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా భాస్కర్ విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - గాజువాక సిటీ : చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ 22వ వార్షికోత్సవ వేడుకలు డైరెక్టర్ పాలవలస భాస్కర రావు, కరెస్పాండెంట్ రమా దేవి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బాలికలు, బాలురు ప్రదర్శించిన సినీ గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలకు చిన్నపిల్లల కు తర్ఫీదు నిచ్చిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, శత శాతం మార్కులు సాధించి స్కూల్ యాజమాన్యానికి, తల్లిదం డులకు పేరు తీసుకు రావా లన్నారు. జివిఎంసి జోన్ 6 కమీషనర్ పి.సింహాచలం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమ శిక్షణతో మెలగాలని చూచించారు. అనంతరం అతిధులు చేతులు మీదుగా గతంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానించారు. కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి. చందు, చట్టి. గోపి, వివిధ పాఠశాలల కరెస్పాన్డెంట్స్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రులు పోలింగ్ పగడ్బందీగా ఏర్పాట్లు

విశాలాంధ్ర - ఆనందపురం : అనందపురం మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగబోతున్న ముందుగా పోలింగ్ జరగబోవు బూత్ లను సందర్శించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పోలింగ్ కు గాను మండలంలో 1599 ఓటర్లకు 293,294, పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎలక్షన్ ప్రక్రియ కొనసా గుతుందని ప్రతిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ లోకవరపు రామారావు ఆర్ఐ మణికంఠ, సిఐ రామచంద్రరావు, ఎస్ఐ నరసింహమూర్తి, ఎఎస్ఐ పైడిరాజు, విఆర్ఓ అప్పలరాజు, పిఓలు మధుకర్, శ్రీధర్, ఎలక్షన్స్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

14 మోదకోండమ్మ తల్లి పండుగా నిర్వహణ కమిటీ సమావేశం

విశాలాంధ్ర - హుకుంపేట : ఆదివాసుల ఆరాధ దైవమైన హుకుంపేట మండల కేంద్రలో మోదకోండమ్మ తల్లి పండుగా నిర్వాణ కమిటీ ఎన్నిక ఈనెలా 14 మంగళవారం సమావేశం నిర్వహిస్తు న్నామని స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల నాయకులు, ఉద్యోగులు, ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పంచాయతీ ప్రజలు వ్యాపారులు అన్ని వర్గాలకు చెందిన వారు ప్రతి ఒక్కరు సాయంత్రం 4 గంటలకు మోదకొండమ్మ ఆలయం మరణంలో హాజరు కావలని ఆమె కోరారు.

మరిడిమాంబ ఆలయానికి 'శరగడం' రూ.4 లక్షల విరాళం



విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత శ్రీ మరిడిమాంబ ఆలయం నిర్మాణానికి మాజీ కార్పొరేటర్, సీనియర్ రాజకీయవేత్త శరగడం చిన్న అప్పల నాయుడు రూ. 4 లక్షలు విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన అప్పలనాయుడు, తనవంతు సాయంగా భారీ విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆధ్యాత్మిక భావన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మరిడిమాంబ ఆలయ నిర్మాణంలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో పెందుర్తి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92వ వార్డు బంట కాలనీలో శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి, శ్రీ శ్రీ శ్రీ దుర్గా దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవములు సందర్భంగా జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కర రావు ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బురెడ్డి గోపి, కంచిపాటి జగదీష్, జవాన శంకర్రావు, షేక్ వల్లి, అప్పలరాజు, వెంకట్రావు, కమలాకర్, సూరిబాబు, సింహాచలం, సురేష్, మనోహర్ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భీమిలి వైసీపీలో మొదలైన ముసలం..

- ఎమ్మెల్యే అవంతి ముఖ్య అనుచరుడు వైసీపీకి గుడ్ బై

- జనసేనలో చేరిన ఈఎస్ఎస్ చంద్రావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : భీమిలి వైసీపీలో ముసలం మొదలైందని ప్రచారం సాగుతుంది. ఎన్నికలు మరో ఏడాది ఉన్న నేపథ్యంలోనే రాజకీయ సమీకరణలు మొదలయ్యాయి. విశాఖ జిల్లాలో కీలకంగా మారిన భీమిలి నియోజకవర్గం పైనే ప్రధాన పార్టీల దృష్టి అధికమైంది. తాజాగా మాజీ మంత్రి, ప్రస్తుత బిమిలీ ఎమ్మెల్యేగా ఉన్న ముత్తం శెట్టి శ్రీనివాసరావుకు ముఖ్య అను చరుడిగా ఉన్న ఈ ఎస్ ఎస్ చంద్రావు వైసీపీని వీడి జనసేనలో చేరడం సర్వత్ర రాజకీయ దుమారం భీమిలిలో మొద లైంది. ముత్తం శెట్టి కూడా వైసీపీ విడు తారన్న ప్రచారం జోరు అందుకుంది. ముత్తం శెట్టి శ్రీనివాస్ మంత్రిగా ఉన్నంత కాలం చంద్రావు ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండేవారు, గతంలో అనకాపల్లి ఎంపీగా, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తం శెట్టి శ్రీనివాసరావుకు వెన్నంటి ఉండి సేవలందించిన చంద్రరావు, రెండేళ్ల క్రితం జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో ఆయన నివాసం ఉంటున్న పీఎపాలెం 6వ వార్డులో ముత్తం శెట్టి శ్రీనివాస్ కుమార్తె ప్రియాంకను కార్పొరేటర్‌గా గెలి పించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అనేక సామాజిక కార్య క్రమాలు చేస్తూ, నిత్యం ప్రజలతో, ప్రజా సమస్యలపై పని చేస్తూ మధురవాడ ప్రాంతంలో క్రియాశీలక నేతగా ఉన్న చంద్రావు అయితే గత కొంతకాలంగా ముత్తం శెట్టి శ్రీనివాస్‌తో విభేదాల కారణంగానే దూరంగా ఉన్నట్లు తెలు స్తోంది. లేదా ఇద్దరు లోపాకారకంగా మాట్లాడుకొని ముందు చంద్రావును పార్టీ మార్చారా అన్న అనుమానాలు కూడా కార్యకర్తల్లో వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఆయన భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్చార్జిగా ఉన్న పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం జన సేనాని పవన్ కళ్యాణ్ సమక్షంలో మంగళగిరిలో జనసేన పార్టీలో ఈ.ఎన్.ఎస్.చంద్రావు చేరిపోయారు. ఇక భీమిలిలో జనసేన బలం మరింత రెట్టింపు కానుందని ప్రచారం సాగుతుంది.

అడుగడుగునా ప్రలోభాలు...!

డబ్బులు పంచుతూ పట్టుబడ్డ ఓ యువకుడు..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నిక సందర్భంగా ఆదివారం అనేక వార్డుల్లో అధికార వైసిపి అనుచరులు యదేచ్ఛగా డబ్బులు పంచుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తాయి. ఓ ప్రజా ప్రతినిధికి చెందిన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి ఈశ్వరరావు అనే యువకుడు ఎమ్మెల్సీ ఓటరు జాబితా పట్టుకొని డబ్బులు పంచుతున్న నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థి అనుచరులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అర్బన్ తాసిల్దార్ శ్యాంప్రసాద్ పోలీసులు విచారించి డబ్బులు పంచుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం వైసీపీ అభ్యర్థిగా ఉన్న సీత%శీ% రాజు సుధాకర్ ఫ్లాట్ వద్ద వెండి నాణాలు పంచుతున్నట్లు ఆరోపిస్తూ టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల కార్యకర్తలు పట్టుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా వైసీపీ గెలవాలని అటు అధికార యంత్రాంగాన్ని వాడుకుంటూ ఇటు విచ్చలవిడిగా ప్రలోభాలకు గురి చేస్తున్నారని విపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఉద్యోగం దొరికే వరకూ పాకులాడుతారు.. దొరికిన తర్వాతా..!!!



విశాలాంధ్ర - సింహచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో పొరుగు సేవలు చేస్తున్న సిబ్బందికి శాశ్వత ఉద్యోగులు లంటే లెక్కలేదు అంటూ సిబ్బంది అంటున్నారు. ఎందుకంటే మేము (శాశ్వత) పరిక్షలు లేదా కారుణ్య నియామకాలపై ఈ డిపార్ట్ మెంట్ లో విధులు నిర్వహిస్తున్నాం. కాని వారు త్రుణమో, పణమో లేదంటే సిఫార్స్ లేఖలపై విధుల్లో చేరి ఆకై వచ్చి మేకులా తయారయ్యారని గుస గుసలు వినిపిస్తున్నాయి. పొరుగు సేవల సిబ్బందికి వేరే సిఫ్ట్ కి రమ్మన్నా, ఒక విభాగం నుండి మరొక విభాగంకు మార్పు చేసినా, సదరు (పొరుగు సేవలు) సిబ్బంది ఇలాగైతే నాకు అవ్వదండి అంటూ ఘాటు సమాదనంతో పాటు నేను సిఫ్ట్ మరను మీకు నచ్చినట్లు మీరు చేసుకోండి అంటూ, రాజకీయ లేక మరోలా పలికబడి ఉపయోగించి సంబందిత శాశ్వత అధికారి లేక సిబ్బందికి ఫోన్ ద్వారా వార్నింగ్‌లు కూడా వస్తున్నాయి అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కొంతమంది పనిలేనప్పుడు, పని దొరకడం లేదని బాధపడతారు. తీరా దొరికిన తర్వాత సోమరులా తయారవుతున్నారు. తద్వారా తమ పీఠానికే ఎసరు తెచ్చుకుంటారు. పని లేనప్పుడు దానికున్న విలువ ఎంతటితో తెలుసుకున్న వారు దొరికిన తర్వాత దర్జాలు పోతుంటారు. ఇక మరికొందరు పని దొరికిందని సంతోష పడటాన్ని మానేసి గాభరా పడుతూ రక్తపోటు తెచ్చుకుంటారు. మంచి పదవి దక్కే దాకా దానికోసమే పోరాడుతారు. ఆ పదవి దక్కిన తర్వాత ప్రతి నిమిషం టెన్షన్ అంటారు. ఇంకా పెద్ద పదవి వస్తే ఏం చేస్తారు...?

రోడ్డు ప్రమాదంలో స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ మాజీ డైరెక్టర్ వైకుంఠరావు మృతి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : కె.బి.ఆర్ జంక్షన్ నుండి కూర్మన్నపాలెం వైపుకు వాకింగ్ చేసి వస్తున్న ఉక్కు ఉద్యోగిని స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ మాజీ డైరెక్టర్ వైకుంఠ రావు రోడ్డు ప్రమాధంలో మృతి చెందిన ఘటన అది వారం స్టీల్ ప్లాంట్ పోలీస్‌స్టేసన్ పరిదిలో జరిగింది. పోలీస్‌లు, స్థానికలు అందించిన సమాచారం మేరకు ప్రతిరోజు లాగే ఆదివారం కూర్మన్నపాలెం నుంచి కె.బి.అర్ జంక్షన్ వరకు వాకింగ్ చేస్తూ వెళ్ళారు. కె.బి.ఆర్ జంక్షన్ నుంచి కూర్మన్నపాలెం వైపుకు వస్తూ ఉండగా అదే దారిలో వస్తున్న పాలు వ్యాను డ్రైవర్ నిద్ర మత్తులో వెనుక నుంచి ఢీ కోవడంతో రోడ్డు పైనపడిపోయారు. వాకింగ్ వచ్చిన స్థానికులు అగనంపూడి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషయముగా ఉండడంతో విశాఖ లోగల కె.జి.హెచ్ కు తరలిలిచంగా మృతి చెందినట్లు డాక్టర్స్ నిర్ధారించారు. వైకుంఠరావు శ్రీకాకోళం జిల్లా బారువ ప్రాంతానికి చెందిన వ్యక్తిని, గత 20 ఏళ్ళలుగా కూర్మన్నపాలెం లోగల శాతనవాహనగర్ రోడ్ నెంబర్ 03 లో నివాసం ఉంటున్నారు.స్టీల్ ప్లాంట్ బాస్ట్ ఫర్నిచర్ విభాగంలో జనరల్ ఫోర్ మెన్ గా విధులను నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు పాలవ్యాన్ డ్రవర్ పైన కేసు నమోదు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

స్టీల్ సిఐటియు సంతాపం

విశాఖ స్టీల్ ప్లాంట్ వై. వైకుంఠ రావు ఉద్యోగిగా చేరిన అప్పటి నుంచి సిఐటియు కార్యకర్తగా కార్మికులకు పలు సేవలను అందించారు. సెంటర్ కమిటి ఆఫీసు బేరర్‌గా పని చెసి కార్మికులమన్నలను పొందారు. స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ డైరెక్టర్ గా సెప్టెంబర్ 2016 నుంచి డిసెంబర్ 2021 వరకు . స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ మరియు పొదుపు సంఘూనికి సేవలను అందించారు. స్టీల్ సిఐటియు గౌరవ అద్యక్షులు జె.అయోధ్య రామ్, అద్యక్షులు వై.టి దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి సంతాపని తెలిపారు.

బలిమెల నీటి వినియోగంపై ఇరురాష్ట్రాల అధికార్లు సమీక్ష

విశాలాంధ్ర - సీలేరు : ఆంధ్రా ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై ఒడిశా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ఓహెచ్‌పిసి కార్యాలయంలో ఇరురాష్ట్రాల అధికార్లు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఏపీ రాష్ట్రం బలిమెల నుంచి ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో లెక్కలు తేల్చారు. ఫిబ్రవరి నెలలో ఏపి తన వాటాగా 7.1601 టిఎంసిల నీటిని వినియోగించుకోగా, ఒడిశా తన వాటాగా 2.6531 టిఎంసిలు వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. అలాగే 2020-2023 నీటి సంవత్సరంలో 2022 జులై 1 నుంచి 2023 ఫిబ్రవరి నెలాఖరు నాటికి ఆంధ్రా 37.1684 టిఎంసిలు వినియోగించుకుందని, ఒడిశా 3.1771 టిఎంసిలు వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ఇప్పటివరకు ఆంధ్రా ఒడిశా కంటే 2.9911 టిఎంసిలు అదనంగా వినియోగించుకుందని నిర్ధారించారు. ప్రస్తుతం జోలాపుట్, బలిమెల జలాశయాల్లో మొత్తం 39.9820 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయని, ఇందులో ఆంధ్రా వాటా 18.4953 టిఎంసిలు గానే, ఒడిశా వాటా 21.867 టిఎంసిలు గాను పంపకాలు చేశారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల విద్యుత్, సాగు నీటి అవసరాల నేపథ్యంలో ఆంధ్రా 4వేల క్యూసెక్కుల నీటిని ఒడిశా 1200 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరురాష్ట్రాల అధికార్లు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా తరపున పొట్టేరు ఇరిగేషన్ ప్రాజెక్టు సిఈ చంద్రశేఖర్ మిశ్రా, చిత్రకొండ ఎర్త్ డ్యాం ఎస్ఈ రమాకాంత్‌పాత్రో, ఈఈ ఉమాశంకర్, ఏఈఈ గడాధర్ ప్రధాన్, ఆంధ్రా తరపున సీలేరు కాంప్లెక్స్ ఏపి జెన్‌కో ఎస్ఈ కెకెవి.ప్రశాంత్‌కుమార్, ఈఈ జి.ప్రభాకర్, ఏడిఈలు టి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సురక్షితంగా పోలింగ్ సిబ్బంది సామగ్రి తరలింపు

విశాలాంధ్ర - పాడేరు : జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రమైన తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాటశాల నుండి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలింపు ప్రక్రియ సజావుగా జరిగింది. ఈ నెల 13వ తేదీన శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం పట్టభద్రుల శాసన మండలి ఎన్నిక జరగనున్న విషయం విదితమే. ఈ నేపధ్యంలో జిల్లా కలక్టరేట్ నుండి ఎన్నికల సామగ్రిని ఉదయం 06.00 గంటలకే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తరలించారు. అక్కడి నుండి రూట్ల వారీగా పోలింగ్ సిబ్బందిని, సామగ్రిని సంబంధిత బస్సులలో ఎక్కించి ఎస్కార్ట్‌తో పోలింగ్ కేంద్రాలకు తరలింపు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కలక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి నేరుగా పోలింగ్ కేంద్రానికి మాత్రమే వెళ్లాలని, మధ్యలో ఎక్కడా ఆగరాదని ఆదేశించారు. మధ్యలో ఆగటాన్నితీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి బస్సులో ఆయా పోలింగ్ కేంద్రానికి చెందినా పీఓ, ఏపీఓ, ఇద్దరు పోలింగ్ సిబ్బంది, ఒక వెబ్ కేస్టింగ్ వీడియోగ్రాఫర్, ఎస్కార్ట్‌లను తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా ఆయా జోన్ల, రూట్ల అధికారులు కూడా వారి వెంట వెళ్ళటం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసి జే.శివ శ్రీనివాసు, రంపచోడవరం సబ్ కలక్టర్ శుభం బన్సాల్, డిఆర్ఓ పి.అంబేద్కర్, ప్రత్యేక ఉప కలక్టర్లు శర్మ, రమణ, పరిపాలనాధికారి చిన్నికృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలుకు ఐ.కొండలరావు, జోనల్, రూట్ అధికారులు పాల్గొన్నారు.

27వ వార్డులో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : 27వ వార్డులోని దొండపర్తి జంక్షన్లో 27వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొన్నారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల మధ్య కేకును కట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారతదేశ ముఖచిత్రం మీద ఒక చరిత్ర సృష్టించిన పార్టీ అని, అభివృద్ధి సంక్షేమమే ఈ పార్టీ యొక్క ఎజెండా అని,రాజన్న కలలుగన్న రాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్లో స్థాపించడమే ఈ పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. పార్టీకి అధ్యక్షులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక సైన్యాధ్యక్షుడిగా పార్టీని నడిపించడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అందరకు ఒక స్ఫూర్తి అని చెప్పారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగం, సంక్షేమం, అభివృద్ధి రంగాలలో భారతదేశంలోనే మిగతా రాష్ట్రాల కన్నా ముందు వరుసలో ఆంధ్రప్రదేశ్ని నిలబెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర్ రెడ్డి, వి.అజయ్ రెడ్డి, కె.మధు గురుమూర్తి, చిట్టి బోయిన శివ, రమణ, త్రినాథ్ అన్నపూర్ణ, రమణమ్మ, కుమారి, కనకమహాలక్ష్మి, అప్పల్ రెడ్డి, శివారెడ్డి అప్పలరాజు, అధిక సంఖ్యలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

దేవీపట్నం : వైఎస్సార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ను ఆదివారం ఇందుకూరుపేట గ్రామంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.తొలుత ఇందుకూరుపేట సెంటర్లో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మండల సచివాలయంల కన్వీనర్ కందుల బాబ్జీ మాట్లాడుతూ 2011 మార్చి 12న స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి సాక్షిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిందని అప్పటి నుంచి ప్రజా సంక్షేమమే పరమావధి గా నవ రత్నాల తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకొస్తూ ప్రజల మన్ననలు చూరగొంటుంది అన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధిలో పురోగతిని సాదిస్తుందని 2024 లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా రాష్ట్రవ్యాప్తంగా ఎగురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కందుల బాబ్జి. గండి పోచమ్మ చైర్మన్ కట్టా సత్యనారాయణ. సర్పంచ్ లక్ష్మణ్.వైస్ ఎంపీపీ గారపాటి మురళి. బండారు శివరామకృష్ణ. బండారు రమేష్. గొర్రెల శ్రీనివాస్. కట్టుమూరు శ్రీనివాస్. రాయపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి 13 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు నాయకులు కూనవరం లోని వైయస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ జడ్పిటిసి గుజ్జ విజయ బాబు మండల కార్యదర్శి ఆలూరి కోటయ్య రైతు సంఘం నాయకులు ఇంటి పూర్ణయ్య కార్పొరేషన్ డైరెక్టర్లు అరవ వెంకట రామారావు దీకొండ లక్ష్మి ప్రసాద్ గంగాధర్ రావు ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి కొమ్మాని వీర్రాజు సునీత కొమ్మాని మోహన్ రావు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలకేంద్రంలోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో వైకాపాపార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ యర్ర అప్పారావు పార్టీ జండా ఎగరవేసి కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు ఎంపీపీ కూరచా జయమ్మ కూరచా నారాయణమూర్తి లాలం జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో నీటి కష్టాలు

విశాలాంధ్ర - నాతవరం : మండల కేంద్రం నాతవరంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గుమ్ముడుగొండ వద్ద గల తాండవ నది నుంచి పైపుల ద్వారా రోజూ నాతవరంలోని ట్యాంకులకు నీటిని పంపింగ్ చేసి, అక్కడ కుళాయిల ద్వారా అందించేవారు. అయితే ఐదు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా మహిళలు నీటిని బిందెలతో తెచ్చుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

హాల్ టికెట్లు ఇవ్వకుంటే క్రిమినల్ కేసులుకు ఆదేశాలు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర - పాడేరు : ఫీజులు కట్టలేదన్న నెపంతో ఏ ఒక్క ఇంటర్మీడియట్ విద్యార్థికి హాల్ టికెట్లు నిరాకరించినట్లు ఫిర్యాదు అందినా, విద్యా సంవత్సరం కోల్పోయినట్లు గుర్తించినా ఆయా కళాశాలల గుర్తింపును 2023-24 విద్యా సంవత్సరం నుండి రద్దు చేసేందుకు సిఫారసులు చేయనున్నామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు.ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు దగ్గరపడుతున్నా చివరి నిముషం వరకు విద్యార్థులను మానసికంగా ఫీజులు పేరిట వేధిస్తున్నట్లు విద్యార్థులు,వారి తల్లిదండ్రుల నుండి తమకు అందుతున్న ఫిర్యాదులను పరిశీలనలోకి తీసుకొని ఆయా యాజమాన్యాలపై అవసరమనుకుంటే క్రిమినల్ చర్యలుకు కమిషన్ తరపున సిఫారసులు చేయనున్నామని అన్నారు.అలాగే పరీక్షలు జరిగే ప్రతీ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు,దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు లేమిపై విద్యార్థులు,వారి తల్లిదండ్రుల నుండి అందే ప్రతీ ఫిర్యాదును యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు,ఆర్ఐఒ లకు ఆదేశాలు జారీచేస్తున్నామని అన్నారు.ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635తో పాటు %apscpcr2018@gmail.com% కు ఫిర్యాదులు అందిస్తే చర్యలు చేపట్టేందుకు కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని సీతారాం చెప్పారు.

కుల, మత, రాజకీయాలకు అతీతంగా భీమసేన పనిచేస్తుంది

భీమసేన వ్యవస్థాపకులు రవిసిద్ధార్థ

విశాలాంధ్ర - పాయకరావుపేట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల దిశగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా భీమసేన పనిచేస్తుందని భీమసేన వ్యవస్థాపకులు రవి సిద్ధార్థ తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవి సిద్ధార్థ మాట్లాడుతూ విద్య, సమాజ సంపద ప్రజలకు జనాభా ప్రాతిపదికిన అందాలన్నారు. పీఎల్‌పురం నాగేంద్ర హత్య కేసులో 49సంఘాలు ఏకమై పోరాటాలు చేశామని తెలిపారు. చట్టం, న్యాయం, కార్యనిర్వహణ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవంగా నడుచుకుంటూ భీమసేన ముందుకు వెళ్తుందని తెలిపారు. ఈసందర్భంగా నాయకులు నెలపర్తి అర్జున్‌రావు పరిశీలనలో భీమసేన నియోజకవర్గ కమిటీ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కన్వీనర్‌గా గారా చంటి, కో-కన్వీనర్‌లుగా వాకపల్లి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి కుమార్, అల్లు దాసు నియమించినట్లు ప్రకటించారు. కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కమిటీలు వేయాలని రవిసిద్ధార్థ సూచించారు. ఈకార్యక్రమంలో భీమసేన ఉపాధ్యక్షులు వరప్రసాద్, డిఎస్ఆర్ రాజు, జ్ఞాన శివకుమార్, కార్యదర్శి అఖిల్, కోశాధికారి పైడిరాజు, వేమగిరి లక్ష్మణరావు, చిట్టిమూరి వరప్రసాద్, గారా రాము, ఏనుగుపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టితో తాత్కాలిక వంతెన నిర్మాణం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మండలంలోని నారాయణరాజుపేట గ్రామంలో రైతు భూములన్నీ సర్పాని అవతల వైపు ఉన్నాయి. దీంతో పొలాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడేవారు. ని నీటిలో నుంచి వెళ్లాల్సి వచ్చేది. కొంత మంది సాహసం చేసి నీటిలో ఈదుకుంటూ ప్రాణాలను కోల్పోయే సంఘటనలు కూడా ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల్లో సర్పానదిపై మినీ వంతెన వేస్తామని చెప్పడంతో టీడీపీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన దువ్వాసి వెంకటగిరిని సర్పంచ్‌గా అంతా ఏకగ్రీవం చేశారు. అయితే ఆయన గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. చివరకు వంతెన నిర్మాణానికి ప్రయత్నం చేయగా ఇంతలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయింది. దీంతో ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. అనంతరం వంతెన చేపట్టి తీరుతామని వైసిపి మద్దతుతో బరిలో నిలిచిన పీలా వరలక్ష్మీ వర్గీయులు చెప్పడంతో చివరకు ఆమెను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటై మూడున్నరేళ్ల గడుస్తున్నా వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్థులంతా ఒక్కటయ్యారు. మూడు రోజుల పాటు శ్రమదానం చేసి నదిలో నుంచి తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పొలాల్లోకి వెళ్లి వచ్చేందుకు కొంత వరకు కష్టాలు తీరాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నికుల క్షత్రియ జిల్లా ఉపాధ్యక్షులుగా గేదెల చిన అప్పలరాజు

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్ : అగ్నికుల క్షత్రియ అనకాపల్లి జిల్లా ఉపాధ్యాక్షులుగా మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన గేదెల చిన అప్పలరాజు నియమితులయ్యారు. ఈమేరకు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షులు నాగిడి సాంబశివరావు అధ్యక్షతన జిల్లా అధ్యక్షులుగా పెమ్మే భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా గేదెల చిన అప్పలరాజును నియమించినట్లు ప్రకటించారు.

'వెలుగు'లో వెలుగు చూస్తున్న అవినీతి అక్రమాలు

నిధులు దుర్వినియోగం...డ్వాక్రా సొమ్ములు స్వాహా

దర్యాప్తునకు గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర - దేవీపట్నం : రంపచోడవరం కేంద్రంగా వెలుగు సంస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకొని బాధ్యులైన ఏపిడి శ్రీనివాసరావు సిసి లపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. మారేడుమిల్లి మండల సమాఖ్య ద్వారా కొనుగోలు చేసిన చింతపండు చీపుర్లు అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని స్వాహా చేశారని, ఉపాధి కల్పనలో డ్వాక్రా సంఘాలకు నెలకొల్పిన పసుపు యూనిట్ల మిషనరీ కొనుగోలు లో సైతం అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సంస్థలో అవినీతికి పాల్పడే సిసి లతో అనేక అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.మిగిలిన మండలాల్లో కూడా ఇదే ఒరవడిని చేపడుతున్నారన్నారు. చింతూరు, వి. ఆర్. పురం మండలాల్లో ఉన్నతి, శ్రీనిధి, హెచ్ డి డబ్బులు దుర్వినియోగం అయ్యాయన్నారు. వై. రామవరం మండలంలో పనిచేస్తున్న సిసి నీలవేణి 6మహిళా సంఘాలకు సంబంధించి రూ 7 లక్షలు స్వాహా చేయగా అందులో ఏపిడీ కి వాటా ఉండటంతో చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అక్కడ ఏపిఎం మధుబాబు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. చింతూరు శివారు నిమ్మలగూడెం లోని శబరి గ్రామ సమాఖ్య సంఘం సొమ్ములు రూ 48000 ఖాతా నుంచి పక్కదారి పట్టించారని పేర్కొన్న సంఘం నాయకులు డ్వాక్రా మహిళలను మోసం చేస్తున్న ఏపిడీ శ్రీనివాసరావు సిసి లపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సాయి సూపర్‌సెప్పషాల్టి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - పద్మనాభం : మండలం లో ఆటో స్టాండ్ దగ్గర విజయనగరం శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ . ఏ శ్రీరామ మూర్తి వారి హాస్పిటల్ డాక్టర్స్ బృందం ,డాక్టర్. అక్కేనా బాలనాగ, శ్రీకర్ క్రిటికల్ కేర్. స్పెషలిస్ట్ , మరియు డాక్టర్ . షేక్. సహబీర్ ఆలీ .%మీా%. ఆర్తోపెడిక్ లు తమ సేవలను ఉచితంగా అందించారు ముందుగా స్థానిక ఎంపీపీ కే.రాంబాబు చేత ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, సుమారు 250 మంది పేషెంట్లకు ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది . శిబిరంలో ఆపరేషన్ అవసరమన్న పేషెంట్లకు హాస్పిటల్లో ఆపరేషన్ కి అయ్యే రూమ్ బెడ్ చార్జీలు,ఆపరేషన్ కి అయ్యే ఖర్చులు ఉచితం మందులు కొనుక్కోవలి అని మరియు ఈ శిబిరానికి వచ్చిన ప్రతి పేషెంట్ కు డాక్టర్. అక్కేనా .బాలనాగ, శ్రీకర్ మరియు ఎంపీపీ చేతులమీదుగా .హాస్పిటల్లో వైద్యానికి అయ్యే ఖర్చులో 50 శాతం ఉచిత రాయితీ ఉన్న కార్డులను వీరి చేతుల మీదగా పేషంట్లకి పంపిణీ చేశారు . శిబిరానికి ముఖ్య అతిథులుగా. పద్మనాభం మండలం ఎంపీపీ ,మండల. వైయస్సార్ పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు ,పెద్దలు తాలాడ పద్మనాభ స్వామి ,అన్నమయ్య ,రెడ్డిపల్లి జగదీష్ మాస్టర్ , బోని సన్యాసి నాయుడు మాస్టర్, లాయర్ ఈర్ల ఈశ్వరరావు, శిరిడి ఆదినారాయణ,మరగడ. అప్పారావు,తాలాడ. నరసింహనాయుడు పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమం మండల ఆర్.ఎం.పీ. అధ్యక్షులు ఆర్.అప్పారావు ఆధ్వర్యంలో జరగగా డాక్టర్ .కే.ఎస్ నాయుడు,.డాక్టర్. రామనారాయణ ఈ ఉచిత వైద్య శిబిరములో పాల్గొన్నారు

మాయమౌతున్న మరుపురాని జ్ఞాపకాలు....

విశాలాంధ్ర - దేవీపట్నం : గోదావరి నదీ తీరాన అందమైన ఆ కుగ్రామాలు ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు వలన పూర్తిగా ముంపుకు గురౌతున్నాయి. ఒకవక్క గోదావరి నదీ సోయగాలు తో మరోపక్క పాపికొండల పచ్చటి ప్రకృతి అందాలు నడుమ సిరులొలికించే మిరప, మొక్కజొన్న పంటలతో ఖ్యాతిని ఆర్జించి పెట్టిన నల్లరేగడి నేలలతో తీరం వెంబడి కనువిందు చేసే గిరిజన గూడెం లు, పల్లెటూరులకు ప్రతీకలుగా నిలిచిన ఆ ముగ్ధ మనోహర దృశ్యాలు ఇప్పుడు లేవు.గోదావరి తీరంలో అలనాడు ఎన్నో చలన చిత్ర దృశ్య మాలికలు రూపుదిద్దుకున్న ప్రదేశాలు, పండుగ పర్వదినాలలో గోదావరి నది లో కోలాహలంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన ఆ దృశ్యాలు ఇప్పుడు లేవు. ప్రస్తుతం శిధిలమైన ఇళ్ళు, నేలకొరిగిన చెట్లు, మునిగి పోయిన దేవాలయాలు, అవన్నీ ఇప్పుడు చూస్తుంటే భూకంపం వల్ల ఇలా మారాయా? సునామీ సృష్టించిన భీభత్సం తో నేలకొరిగాయా? అన్నట్టు అనిపిస్తుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తో కాఫర్ డ్యాం తో బ్యాక్ వాటర్ నిల్వలు పెరగటంతో ముంపు గ్రామాలన్నీ పూర్తిగా నీట మునిగి పోయిన పరిస్థితి. ఇక్కడ గ్రామాలన్నింటినీ ఖాళీ చేయించి అధికారులు పునరావాస ప్రాంతాలకు తరలించారు. భవిష్యత్తు లో ఈ గిరిజన గూడెం లలో నివసించిన నిర్వాసితులకు తమ గ్రామం ఎలా ఉంటుందో చూసు కోవటానికి వస్తే గోదావరి గర్భంలో కలిసిపోయిన ఆనవాళ్ళు కూడా కనిపించవు. ప్రస్తుతం పాపికొండల పర్యాటకులకు ఆ అందమైన సుందరమైన దృశ్యాలను కనులారా తిలకించవచ్చు.

ఉత్కంఠగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు...

నేడు ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేడు జరుగుతున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నిక ఉత్కంఠ గా మారింది. ఉత్తరాంధ్ర లో ఉన్న 6 జిల్లాల్లో పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోరు పై రాష్ట్రమంతా సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరులో 37 మంది బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, అధికార వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్, టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు ల మధ్య సాగుతుంది. బిజెపి నుండి సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న పీవీయన్ మాధవ్ కూడా పోటీల్లో ఉన్నప్పటికీ ఈసారి ఎన్నికల్లో బిజెపికి చుక్క ఎదురు తప్పదని తెలుస్తోంది. ఇక మిగిలిన వారంతా స్వతంత్ర అభ్యర్థులుగానే పోటీలో ఉన్నారు. ఉత్తరాంధ్రా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను అధికార ప్రతిపక్ష పార్టీలతోపాటు పీడిఎఫ్ పార్టీలు కూడా ప్రతిష్టాత్మకంగానే తీసుకున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నంజిల్లాల్లో 37 మంది అభ్యర్డులు బరిలోఉంటే, పోటీమాత్రం ఆ నలుగురు అభ్యర్డులు మధ్యనే నెలకొన్నది. పీడిఎఫ్ అభ్యర్థి డా.రమాప్రభ, వైఎస్సార్సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవి, బీజేపీ అభ్యర్థి మాధవ్ ల మధ్యే కనిపిస్తున్నది. మిగిలిన అభ్యర్థుల పోటీ ద్వారా కొన్ని 20% ఓట్లు చెల్లాచెదు రైపో యినా, మిగి లిన 80% ఓట్లను ప్రధాన పోటీగా భావించేవారు పంచుకోవాల్సి వుంది. ఇందులో కూడా కేవలం ఇద్దరి మధ్యనే ప్రధాన పోటీ ఉందని కూడా నిరుద్యోగ పట్టభద్రులు, ఉపా ధ్యాయులు చెప్పుకొస్తున్నారు. కొందరు మార్పుకోసం ఓట్లు వేయాలని చూస్తే, మరికొందరు పోటీలో తమ అభ్యర్థిని ఎలాగైనా గెలిపించాలనే పంతంతో ఉన్నారు. ఇంకొం దరు ప్రభుత్వానికి ఓటుబలం తెలియజేయాలనే తలంపుతో ఉన్నట్టు కనిపిస్తున్నది. రాష్ట్రంలో మూడు పట్టభద్రుల స్థానాలకు, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు. నేడు జరగనున్నాయి. అన్నింటికన్నా ఉత్తరాంధ్ర పట్టబద్దలు ఎమ్మెల్సీ స్థానం పైనే అధికార వైసిపి అన్ని శక్తులు పెట్టి గెలుపు కోసం ఆరాటపడుతుంది. ఐదుగురు మంత్రులు, నలుగురు ఎంపీలు, 30 ఎమ్మెల్యేలు విస్తృత ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థి సుధాకర్ గెలిపించు కునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు.

వైసిపి అభ్యర్థిగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్న సీతంరాజు సుధాకర్ ను 6 నెలల క్రితమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేరుగా ప్రకటించడం విశేషం. ఉత్తరాంధ్ర జిల్లాల టిటిడి చైర్మన్, రీజినల్ కోఆర్డినేటర్ వైవి. సుబ్బారెడ్డి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సమావేశం ఏర్పాటు చేసి సుధాకర్ గెలుపుకు వ్యూహరచనలు చేశారు. కుల సమీకరణలు, మతాల వారీగా, వర్గాలు వారీగా, సమావేశాలు పెట్టి మరి సాధారణ ఎన్నికలను తలపించేలా ఈ ఎమ్మెల్సీ ఎన్నిక జరగడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అధికారం అండతో అడుగడుగునా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ, అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ, బెదిరిస్తూ, దొంగ ఓట్లతో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వామపక్షాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన డాక్టర్ కోరెడ్ల రమా ప్రభ ని గెలిపించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల పట్టబద్ధులంతా విస్తృతంగా వాడవాడలా ప్రచారం పూర్తి చేశారు . నేడు జరిగే ఎన్నికనే పద్యంలో అందర్నీ ఓట్లు వేసేలా అధికారులు ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరుతున్నారు. ఉత్తరాంధ్ర సమస్యలు పై శాసనమండలిలో గళం విప్పే రమాప్రభ కే ఓటు వేయాలని ఉద్యోగులంతా భావిస్తున్నారని తెలుస్తుంది. టిడిపి నుండి చోడవరం నియోజకవర్గానికి చెందిన వేపాడ చిరంజీవిరావును టిడిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రచారాన్ని ఆ పార్టీ నేతలు నిర్వహించారు. అరాచకాలు చేస్తున్న అధికార వైసిపి అభ్యర్థ ని ఓడించాలని, పట్టబద్ధులంతా ఆలోచించి ఓటు వేయాలని టిడిపి నేతలు విస్తృత ప్రచారం చేపట్టారు.

గెలిచే అభ్యర్థికి సగం ఓట్లు రావాల్సిందే...

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో ఏ అభ్యర్థి గెలవాలన్నా ప్రస్తుతం రిజిస్టర్ అయిన 2,89,214 ఓట్లలో

సగానికిపైగా ఒక అభ్యర్థికి పడాలి. ప్రస్తుతం ఎన్నికల బరిలో 37 మంది ఉన్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం ముగ్గురు అభ్యర్థుల మధ్యే ఉన్నది. ఎన్నికల సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 331 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతుంది. ఎమ్మెల్సీ పీటంపై అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు పీడిఎఫ్, బీజేపీ అభ్యర్థులు కూడా ఎవరి ధీమాలో వారున్నారు. ఎన్నడూలేనివిధంగా సార్వత్రిక ఎన్నికలను తలిపించే విధంగా ఈసారి ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తీరు అన్నివర్గాల ప్రజలను ఆలోచింపజేస్తున్నది. ప్రధాన పోటీలో ఉన్న అభ్యర్థులు గెలుపు ధీమాతో ఉన్నప్పటికీ మిగతా అభ్యర్థుల వలన ఈసారి ఓట్లు చీలిపోతాయనే భయం అందరినీ వెంటాడుతోంది. మొదటి ప్రాధాన్యత అత్యధిక ఓట్లు ఎవరికి వస్తాయోననే ఉత్కంఠ మొదలైంది.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం...

2007 తొలిసారి శాసనమండలి ఎన్నికలు జరిగాయి. ఇది నాలుగోసారి ఎమ్మెల్సీ ఎన్నిక కానుంది. పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బంది 2038 ని నియమించగా, పోలింగ్ నిర్వహణ బందోబస్తు కోసం పోలీసులు మరో 1200 మందిని నియమించినట్లు సిపి వెల్లడించారు. 27 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 1,119 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయగా, 167 ప్రాంతాల్లో మొత్తం పోలింగ్ కేంద్రాలు 331 ఏర్పాటు చేశారు, మొత్తం ఓట్లు 2,89, 214 కాగా, ఇందులో మహిళలు 1, 07,029 ఉండగా, పురుషులు 1,82, 147 ఉన్నారు, ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోలింగ్ జరగనుంది.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

గుంతల రహదారితో వాహన చోదకుల ఇక్కట్లు

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలోని ఎర్రంపేట గ్రామం నుండి ఒరిస్సా గ్రామానికి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు నూతులను కల్పిస్తున్నాయి. నిత్యం ఒరిస్సా నుండి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారి గత సంవత్సర కాలం నుండి రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాద భరితంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం విచారకరం. ఏదైనా ఘోరం జరిగితేనే కానీ ఈ ప్రమాద భరిత గోతులు పూడ్చే అవకాశం ఉండదేమోనని వాహన చోదకులు వాపోతున్నారు. నిత్యం వందలాది భారీ వాహనాలు ఆర్టీసీ బస్సులు తదితర వాహనాలు తిరిగాడే ఈ రహదారి మలుపు వద్ద ఏర్పడిన ఈ గోతులను పూడ్చి మరమ్మత్తులు చేయాలని గతంలో అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు పత్రిక ముఖంగా తెలియజేసినా పట్టించుకున్న నాథుడే లేడు. ఎవరు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై గోతులు మరి లోతుగా మారి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. చింతూరు డివిజన్ కేంద్రంలోనే రహదారులు ఇంత ఘోరంగా ఉన్నాయంటే ఇక మారుమూల పల్లెలో పరిస్థితి మరింత దయానియంగా ఉంటుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఐటీడీఏ . ఆర్డీవో వంటి ఉన్నతాధికారులు ఈ చింతూరు మండల కేంద్రంలో ఉన్న కానీ ఇటువంటి దయానియా రోడ్ల పరిస్థితి పై పలువురు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారిపై ఏర్పడిన గోతులను మరమ్మతులు చేసి రవాణాకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - చింతపల్లి: వైసీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని చింతపల్లి లో ఆ పార్టీ అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ హోలియా రాణి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక వెనుకబడిన తరగతుల ఆశ్రమ వసతి గృహం వద్ద విద్యార్థినిలతో కలసి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి అనంతరం కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు.

యలమంచిలి: నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి పట్టణ వైసీపీ కార్యాలయంలో మున్సిపాలిటీ, మండల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోదెపు గోవింద్ కేక్ కట్ చేసి వైసీపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేశ్వరరావు, గుప్తా, వైసిపి పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్య దొర, రూరల్ పార్టీ అధ్యక్షులు త్రినాథ్, కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, కో-ఆప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి, వైసీపీ సీనియర్ నాయకులు సేనాపతి రాము, పిల్లా త్రినాథ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 95 వ వార్డు పురుషోత్తపురంలో స్థానిక కార్పొరేటర్, వైసీపీ సీనియర్ నాయకుడు ముమ్మన దేముడు కేకు కత్తిరించి పార్టీ నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే జీవీఎంసీ 97వ వార్డు, చిన్న ముసిడివాడలో పార్టీ అధ్యక్షుడు మెంటి మహేష్ ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన కేకు కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ జేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ సమాజంలోని పేదవాడి కళ్ళల్లో ఆనందం నింపేందుకు పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైసిపిని స్థాపించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కని విని ఎరుగని సంక్షేమ పథకాలు అమలుచేస్తూ పేదల పాలిట ఆపద్బాంధవుడయ్యారని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో హోమం

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: పట్టణంలో ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో సమరసతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మాన్ని కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సమరసతా సేవ ఫౌండేషన్‌లో సంస్థకు సభ్యత్వం తీసుకున్న కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ నాగేశ్వరావు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. ఈ మహా యజ్ఞంలో ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ ఆదారి గంగాధర్, జిల్లా ధర్మ నిధి ప్రముఖులు కొన్ని అర్జున్ రావు,మండల కన్వీనర్ రాజాన సత్యనారాయణ,మహిళా కన్వీనర్ సత్యవేణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - నాతవరం: మార్చి 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం నాతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు, బందోబస్తు ఏర్పాట్లపై తహశీల్దార్ కనకారావుతో చర్చించారు. మండలంలో 1671 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందని విలేకర్లకు తెలిపారు. డిటి చైనులు, వీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బారాస ఎమ్మెల్సీ కవితపై వ్యాఖ్యలు అనుచితం

విశాలాంధ్ర - గాజువాక : భారాస ఎం ఎల్.సి కవిత పై భాజపా తెలంగాణ చీఫ్ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉక్కు లోని తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ భాజపా ప్రభుత్వ విధానాలను ఎండ కడుతున్నందుకు ప్రతి పక్ష పార్టీలపై సీబీఐ , ఈడి దాడులకు పూనుకుంటున్నార నీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై భాజపా కక్ష కట్టి లిక్కర్ స్కాం లో ఎం.ఎల్.సి కవిత ను ఇరికించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే పార్టీలపై కక్ష సాధింపు చర్యలను విడనాడాలని విరమించు కోవాలని డిమాండ్ చేసారు. కేంద్రం తన తప్పులను కప్పి పుచ్చు కునేందుకు దర్యాప్తు సంస్థలను ప్రతి పక్షాల పై ఉసి కొల్పుతున్నారని అక్షేపించారు.

ఈఎన్‌టీ వైద్యాధికారి నియామకం

విశాలాంధ్ర - చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో ఎట్టకేలకు చెవి, ముక్కు, గొంతు (ఈ ఎన్ టి) నిపుణుడైన వైద్యాధికారి రుత్తల వర ప్రసన్న ఒప్పంద ప్రాతిపదికపై నియమితులయ్యారు. అల్లూరి జిల్లా ఏర్పడిన నాటి నుంచి మన్యంలో గల ముఖ్యమైన ఏరియా ఆసుపత్రులలో అవసరమైన నిపుణులైన వైద్యులను నియమిస్తున్న క్రమంలో భాగంగా ఇప్పటికే చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు స్త్రీ వైద్య నిపుణులు అందుబాటులో ఉండగా, నేడు చెవి, ముక్కు గొంతులకు సంబంధించిన వర ప్రసన్న నియమితులు కావడంతో ఈ ప్రాంతంలో ఆయా సమస్యలతో బాధపడుతున్న రోగులకు సమస్య పరిష్కరించే దిశగా వైద్యాధికారి ఏరియా ఆసుపత్రిలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఈ ప్రాంతీయలో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మానవ హక్కుల అసోసియేషన్‌ను ఆశ్రయించిన మహిళకు న్యాయం

విశాలాంధ్ర - చింతపల్లి : మానవ హక్కుల అసోసియేషన్ ను ఆశ్రయించిన కులాంతర వివాహ బాధిత మహిళ కు ఎట్టకేలకు న్యాయం జరిగిందని మానవ హక్కుల అసోసియేషన్ అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మినుముల రాంబాబు, వంతల రామారావు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ కులాంతర వివాహం చేసుకొని బిడ్డ పుట్టాక ముఖం చాటేసిన ఉపాధ్యాయుడు ఎట్టకేలకు దారికొచ్చాడు. మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించిన బాధితురాలు మౌనవతి తో కమీషన్ ఎదుట జరిగిన చర్చలలో మౌనవతి కి అన్ని విధాలా న్యాయం చేస్తానని, అదే క్రమంలో బిడ్డ పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని రాజీకి రావడంతో మానవ హక్కుల అసోసియేషన్ జిల్లా నాయకుల సమక్షంలో భార్యాభర్తల పేరిట ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరవడంతోపాటు, భర్తకు వచ్చే వేతనంలో సగభాగం బాధితురాలు మౌనవతికి భరణంగా ఇచ్చేందుకు అంగీకరించడం, అదే క్రమంలో బిడ్డ పేరిట పోస్టల్ ఖాతా తెరచి ప్రతి నెల చెరో 5000/- రూపాయలు జమ చేయడానికి ఒప్పందం కుదర్చడం జరిగిందని, ఆరోగ్య, విద్యపరంగా బిడ్డ యొక్క పూర్తి బాధ్యత తండ్రిదేనని ఆ ఒప్పందంలో తేల్చి చెప్పడం జరిగిందని వీటన్నింటికీ మౌనవతి భర్త ఉపాధ్యాయుడు పూజారి సంజీవరావు ఒప్పుకోవడంతో సమస్య కొలిక్కివచ్చిందని, ఈ ఒప్పందాన్ని ఏ ఒక్కరు అతిక్రమించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మానవ హక్కుల కమిషన్ సంజీవరావు, మౌనవతి లకు సూచించింది. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొర్ర రాంబాబు, కార్యదర్శి కొర్ర రంగారావు, గెమ్మెల కొండబాబు, ఈశ్వర రావు, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా పోలింగ్ నిబంధనలు అమలు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల కు సంబంధించిన పోలింగును పిఓలు, సిబ్బంది నిబంధనలను తు.చ. తప్పకుండా అనుసరిస్తూ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టణ శెట్టి ఆదేశించారు. ఆదివారం స్థానిక ఏ ఎం ఏ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ. పోలింగ్ అధికారి డైరీ లో సూచించిన విధంగా ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను అనుసరిస్తూ ప్రశాంతంగా పారదర్శకంగా పోలింగ్ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆర్డీవోలు తాసిల్దార్లు తగిన ఏర్పాటు చేశారన్నారు. సామాగ్రి తీసుకున్న నాటినుండి పోలింగ్ పూర్తిచేసి తిరిగి అప్పగించేంతవరకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. చిన్న పొరపాటు కూడా చేయరాదన్నారు. పోలింగ్ ప్రక్రియ వెబ్ కాస్ట్ జరుగుతుందని, నిబంధనలను అనుసరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎవరూ బూత్ లోనికి రాకూడదనే నిబంధన తప్పక పాటించాలన్నారు. జిల్లాలో ఉన్న 49 పోలింగ్ కేంద్రాలకు పది రూట్ లలో 10 బస్సులను వేయడం జరిగిందని, రూట్ ఆఫీసర్ సిబ్బందితో బస్సులు బయలుదేరుతాయని పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే తిరిగి అదే బస్సులో రావాలని చెప్పారు. అంతకుముందు సహాయ ఎన్నికల అధికారి, డిఆర్ఓ పోలింగ్ నిర్వహణపై, అవసరమైన సామగ్రిని తీసుకోవడం తిరిగి అప్పగించడం మొదలైన విషయాలపై దిశా నిర్దేశం చేశారు. అనకాపల్లి నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం ఆయనకు సహకరించారు. పోలింగ్ సామాగ్రిని స్వీకరించి, సరిచూసుకొని మధ్యాహ్నం పోలింగ్ అధికారులు సిబ్బంది బస్సులలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి సందీప్, ప్రత్యేక ఉప కలెక్టర్లు జ్ఞాన వేణి, రమామణి, కలెక్టరేటు ఆర్డీఓ కార్యాలయాల పరిపాలనాధికారులు శ్రీనివాసరావు, నరసింహమూర్తి, గంగాధర్ రావు, సెక్షన్ సూపరిండెంట్ లక్ష్మీదేవి, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - ఏఎస్ఆర్ జిల్లా: ఫీజులు కట్టలేదన్న నెపంతో ఏ ఒక్క ఇంటర్మీడియట్ విద్యార్థికి హాల్ టికెట్లు నిరాకరించినట్లు ఫిర్యాదు అందినా, విద్యా సంవత్సరం కోల్పోయినట్లు గుర్తించినా ఆయా కళాశాలల గుర్తింపును 2023-24 విద్యా సంవత్సరం నుండి రద్దు చేసేందుకు సిఫారసులు చేయనున్నామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు దగ్గరపడుతున్నా చివరి నిముషం వరకు విద్యార్థులను మానసికంగా ఫీజులు పేరిట వేధిస్తున్నట్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి తమకు అందుతున్న ఫిర్యాదులను పరిశీలనలోకి తీసుకొని ఆయా యాజమాన్యాలపై అవసరమనుకుంటే క్రిమినల్ చర్యలుకు కమిషన్ తరపున సిఫారసులు చేయనున్నామని అన్నారు. ,అలాగే పరీక్షలు జరిగే ప్రతీ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు,దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు లేమిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి అందే ప్రతీ ఫిర్యాదును యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్ఐఓలకు ఆదేశాలు జారీచేస్తున్నామని అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635కి ఫిర్యాదు చేస్తే చర్యలు చేపట్టేందుకు కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని సీతారాం చెప్పారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాజువాక నియోయజక వర్గం సిద్ధం అయ్యింది. నియోజక వర్గ పరిధిలో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో 15 వందల మంది తమ ఓటు హక్కును వినియోగించుకో బోతున్నారని అధికారిక సమాచారం. క్రమ సంఖ్య 202 నుండి 218 వరకూ పోలింగ్ కేంద్రాలు గాజువాకను కవర్ చేస్తుండగా ఇందులో 202, 203 ఈ రెండు బూత్‌లు పెందుర్తి నియోజక వర్గ పరిధికి వెళ్లాయి. కనీసం 4 కిలోమీటర్లు దూరంలో పోలింగ్ కేందాలు ఏర్పాటు ఉండేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్టింగ్ అందుబాటులో ఉంచారు. ఉదయం 8 గంటల నుండి సాయింత్రం 4 గంటల వరకూ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. శనివారం సాయింత్రం నుండే డ్రైడేని యంత్రాంగం ప్రకటించడంతో వాతావరణం చల్లబడిపోయింది. ఎన్నికలు పూర్తయ్యే వరకూ మందు బాబులకు కులాశా కరువనే చెప్పక తప్పదు.

గాజువాకలో ఎమ్మెల్సీ ఓటింగ్ బూత్‌లు ఇవే

గాజువాకలో ఎమ్మెల్సీ ఓటింగ్ బూత్‌లు ఇలా ఉన్నాయి. 204 నడుపూరు, పెదగంట్యాడ: జెడ్పీ హైస్కూలు, నడుపూరు. 205 దుర్గవానిపాలెం, పెదగంట్యాడ, ఎంపీపీ స్కూలు, దుర్గావానిపాలెం. 206 బాలచెరువు, పెదగంట్యాడ, ఎంపీపీ స్కూలు, బాలచెరువు. 208, 209 స్టీల్‌ప్లాంట్, విశాఖ విమల విద్యాలయం, సెక్టరు -6 ఉక్కునగరం. 210, 210ఎ, 211, 211ఎ, 212 కణితి, వడ్లపూడి, జెడ్పీ హైస్కూలు, వడ్లపూడి. 207, 213, 213ఎ, 214, 215, 216 217, 218 గాజువాక, అక్కిరెడ్డిపాలెం, జెడ్పీ హైస్కూలు గాజువాక. ఓటర్లు ఈ క్రమంలో తమ ఓటు హక్కును వినియోగించుకో వచ్చును.

యలమంచిలి: ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకి సంబంధించి యలమంచిలి ఎన్నికల పోలింగ్‌కు యలమంచిలి పరిధిలో ఒక పురపాలక సంఘం,మండల పరిధిలో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు బూత్ లలో మొత్తం ఓటర్లు 2354 మంది ఓటు హక్కును వినియోగించుకొనున్నారు.ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.పోలింగ్ ఏజెంట్లు బూత్ లలో సదుపాయాలు కల్పించారు. ఎన్నికలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

మున్సిపాలిటీ, మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాసీల్దార్ రాణి అమ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఎమ్మెల్సీ

హుకుంపేట: ఎమ్మెల్సీ ఎన్నికలు పక్కగా నిర్వహించి పట్టభద్రులు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు పూర్తి చేస్తున్నాట్లు స్థానిక తహసీల్దార్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, ఎంపీడీవో వెంకటరావు, ఎస్ ఐ సతీష్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నిర్వహించే పోలింగ్ ఉద్యోగులు, పట్టభద్రులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రతలు తీసుకోవాల్సిందిగా సిబ్బందికి సూచించారు. పోలింగ్ సమాయల్లో ఎటువంటి రిగ్గింగ్లకు పాలు పడకుండా ఉండేందుకు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటు వినియోగించుకోనేంకు వచ్చే ఉద్యోగులు తమ వద్ద గుర్తింపు కార్డుతో ఓటరు

కాగితం తప్ప మరి ఏ వస్తువు తీసుకొని రాకూడదని తెలిపారు. మండలంలోని పట్టభద్రులు మొత్తం 1720 మంది ఉన్నారని రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మొదటి పోలింగ్ కేంద్రం 148 దీనిని 900 మంది ఓటు వినియోగిస్తారని, రెండో కేంద్రంలో 148 ఎ లో 820 మంది ఓటును వినియోగిస్తారని తెలిపారు మండలంలో ప్రతి పట్టభద్రుడు తన ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రంగారావు, జునియర్ అసిస్టెంట్ లక్ష్మణమూర్తి, స్థానిక వీఆర్వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజీ రోబోటిక్స్‌పై అపోలో లైవ్ వర్క్‌షాప్

విశాలాంధ్ర -విశాఖ సిటీ: అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో విశాఖ గైనకాలజీ వైద్యుల సొసైటీ సహకారంతో ఆదివారం గైనకాలజీలో రోబోటిక్స్ పై కంప్లీట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ లైవ్ వర్క్ షాప్ నిర్వహించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా జరిపినట్టు హైదరాబాద్ జూబ్లీ హిల్స్ అపోలో హాస్పిటల్ కి చెందిన సీనియర్ కన్సల్టెంట్ లాప్రోస్కోపిక్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ రూమా సిన్ హ చెప్పారు. భారతదేశ వ్యాప్తంగా ఉన్న రోగులకు అధునాతన చికిత్సలు అందించడంలో అపోలో హాస్పిటల్స్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అపోలో హాస్పిటల్స్, హెల్త్ సిటీ లో రోగులకు అత్యుత్తమ మినిమల్ ఇన్వాసివ్ సర్జికల్ కేర్‌ను అందించడానికి అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్/రోబోటిక్ ఫెసిలిటీ అనుభవజ్ఞులైన సర్జన్లతో పూర్తిగా అమర్చబడిందన్నారు. ఏపీ రాష్ట్రంలో తొలిసారిగా బినైన్ గైనకాలజీలో రోబోటిక్ సర్జరీని విశాఖపట్నంలోని అపోలో హాస్పిటల్స్ డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో వైద్య బృందం విజయవంతంగా చేశారని ఆమె తెలిపారు. ఇప్పటికే గైనకాలజీ, యూరాలజీ జనరల్, జి ఐ సర్జరీ, ఆంకాలజీ వంటి వివిధ విభాగాల నుండి దాదాపు 100 శస్త్రచికిత్సలు చేసారన్నారు. ఈ లైవ్ వర్క్ షాప్ కి ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శశి ప్రభ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్క్ షాప్ లో రోబోటిక్ హిస్టెరెక్టమీ వంటి క్లిష్టమైన లైవ్ సర్జరీలను ప్రదర్శించారు. ఈ రంగంలో తమ అపారమైన అనుభవాన్ని ప్రతినిధులతో వైద్యుల బృందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ సీఈవో వై.సుబ్రమణ్యం సీఓఓ, రామచంద్ర, గైనకాలజిస్టులు డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విద్య లతోపాటు ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి దాదాపు 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరగాలి

విశాలాంధ్ర - చింతపల్లి: జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, పాడేరు మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆదివారం చింతపల్లి వచ్చిన ఆమె మండల కేంద్రంలో సోమవారం జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రులంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను దృష్టిలో ఉంచుకొని దూర దృష్టితో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు కూడా సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు ఆంద్రాబు లక్ష్మణ్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ ఖాసిం వల్లి, లక్కోజు నాగభూషణం, గోసరెడ్డి సోమేశ్వరరావు, పి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వంటశాలను సందర్శించిన ఐఐఎం విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో చదువుతున్న 200 మంది స్టూడెంట్స్ అవగాహనా తరగతులలో భాగముగా ఐఐఎం ప్రొఫెసర్ పి ఆర్ ఎస్ శర్మ మార్గదర్శంలో గంభీరంలో గల అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటశాలను సందర్శించారు. ఈ కార్యక్రమములో అంబరీష దాస ప్రెసిడెంట్ అక్షయ పాత్ర ఫౌండేషన్ గంభీరం వంటశాల, అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటచేయు విధానం ప్రభుత్వ , ప్రైవేట్ భాగస్వాయం గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఐఐఎం స్టూడెంట్స్ మాట్లాడుతూ అక్షయ పాత్ర ఫౌండేషన్‌లో వంటచేయు విధానం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ యదురాజా దాస స్వామిజి, ప్రవీణ్ కుమార్, విజయకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలో అల్లూరి విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - మాడుగుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 95-96వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అప్పటి గురువులైన రామ్మోహనరావు మాస్టర్ చేతుల మీదుగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జవ్వాది వరహాలరావు, దంగేటి మోహన్, కర్రి ప్రకాష్, యర్రంశెట్టి గణేష్, పంద నూకరాజు, జి వాసు, ఆర్ జగన్నాధరావు, గాడి రాజా తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం బడనాంపల్లి పంచాయితీ కొత్తవీదికి గ్రామానికి చెందిన బొనేం కామరాజు చెందిన తాటాకిల్లు ఆదివారం పూర్తిగా కాలి దగ్ధమైంది. కామరాజు రోజులాగే ఉదయాన్నే తన కుటుంబంతో జీడీ తోటలో వెళ్లాడని, ఎవరు లేని సమయంలో ఈ ప్రమాదం జరింగిందని, కరెంట్ సార్టేజ్ వలన ప్రమాదం జరిగి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కట్టు బట్టలు పట్టాదారు పాస్ పుస్తకాలు, తిండి గింజలు, వంటసామాగ్రి పూర్తిగా కాలిబుడిదవ్వడంతో తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.

14న యూఎస్‌ఏ అడ్మిషన్స్ డే

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విదేశీ విద్యను అభ్యసించాలి అనుకునే వారికి యూని ఎక్స్ పర్ట్స్ సంస్థ వాళ్ళు అవకాశం కల్పిస్తున్నారు. దీనికి సంబంధించి యూఎస్‌ఏ అడ్మిస్సిన్స్ డే మంగళవారం యూనిక్సుర్ట్స్ ఆఫీసు లో నిర్వహిస్తామని వైజాగ్ బ్రాంచ్ మేనేజర్ అనిత కొమ్మరజు తెలిపారు. ఆదివారం వైజాగ్ లోని యూనిక్సుర్ట్స్ సంస్థ కార్యాలయంలో మీడియా తో మాట్లాడు తూ మంగళవారం ఉదయం 11 గంటల నుండి యూఎస్‌ఏ అడ్మిషన్స్ డే ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో 15 కి పైగా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు పాల్గొంటున్నాయ న్నారు. వివరాలకు 7785 968 968 ను సంప్రదించవచ్చు అని పేర్కొన్నారు. ఈ సమావేశం లో బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ రావాడ నాయుడు శారన్ సైదా రేఖ భవ్య తదితరులు పాల్గొన్నారు.